# మణిహారం



## 1

TP TRUST 68

Mothiyon ka Haar (Urdu Part I & II)-1
(Telugu)

# మణిహారం

## (మొదటి భాగం)

మూలం:

మౌలానా అఫ్జల్ హుసైన్

అనువాదం:

అబ్దుల్ వాహెద్

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజిష్టర్డ్)**
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002. ఫోన్: 24564583

Manihaaram-1

**Mothiyon ka Haar (Urdu Part I & II)-1** (Telugu)

**T.I.P. Series No. 68**

Author : Maulana Afzal Hussain

Translated by : Abdul Wahed

All Rights Reserved with Publishers

3rd Edition : March 2013

Copies : 2,000

Price : **Rs.12**

ISBN : 81 - 86826 - 67 - X

Published by **Telugu Islamic Publications Trust** (Regd.)
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +040 + 24576237
e-mail: tiphyderabad@rediffmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad - 2

Printed at : Cosmic Printers
Lakkadkot, Hyderabad - 2

# చిన్నారి అమ్మాయిలు

చిన్నారి అమ్మాయిల్లారా! మీరు మెడలో వేసుకునే రంగు రంగుల హారాలు చూసే ఉంటారు. బంగారం రంగువి, రంగు రంగుల రాళ్ళవి, ముత్యాలు పొదిగినవి, వెండిలా తెల్లటివి, సాదావి, చిన్నవీ పెద్దవి, అసిలీవీ, నకిలీవి చాలా చూసి ఉంటారు. ఆ హారాల తళతళలు, మిలమిలలు, అందచందాలు చూసి మీరు, "అబ్బా! ఇలాంటి అందమయిన హారం నా దగ్గర కూడా ఉంటే ఎంత బావుంటుంది!" అనుకునే ఉంటారు.

కాని, కళ్ళను మిరుమిట్లుగొలిపే ఈ అందచందాల హారాలు కొంత కాలానికి పైపై మెరుగులు పోయి ఏమంత అందంగా కనబడవు. వాటి రంగు మాసిపోతుంది. కాంతి పోతుంది. అవి తెగిపోవచ్చు. అంతేకాదు, ఎవరైనా దొంగలు దోచుకోనూవచ్చు.

నేను మీ కోసం స్వచ్ఛమయిన, అమూల్యమైన ముత్యాలు పొదిగిన, అందమయిన ఓ హారం తయారుచేశాను. ఈ హారం ఎప్పటికీ తళతళమని మెరుస్తూనే ఉంటుంది. ఈ హారాన్ని గనుక మీరు ధరించారా, ఇక మీరు అందరికి కంటి వెలుగైపోతారు. అంతేకాదు, ప్రళయదినాన ఇది మీకు పనికివస్తుంది. అల్లాహ్ మీకు శ్రేయాన్ని చేకూర్చుగాక!

మీ శ్రేయోభిలాషి<br>
అఫ్‌జల్ హుసైన్

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | స్త్రీలలో ఉత్తమురాలు | 5 |
| 2. | దైవ ప్రేమ | 6 |
| 3. | తండ్రిపై ప్రేమ | 8 |
| 4. | అణకువ | 10 |
| 5. | నిజాయితి | 11 |
| 6. | సాహసం | 13 |
| 7. | తన పని తనకు | 14 |
| 8. | బీదలకు సహాయం | 15 |
| 9. | గుర్తుంచుకోదగ్గ మాటలు | 17 |
| 10. | సిగ్గు-లజ్జ | 18 |
| 11. | ఖుర్‌ఆన్ పఠనం | 20 |
| 12. | ప్రవక్త (స) పట్ల ప్రేమ | 22 |
| 13. | తల్లిదండ్రులను అయిష్టపరచరాదు | 23 |
| 14. | దానం | 24 |
| 15. | తప్పును ఎత్తిచూపడం | 26 |
| 16. | పరోపకారం | 28 |
| 17. | అక్రమ సంపాదన | 29 |
| 18. | గుర్తుంచుకోదగ్గ మాటలు | 31 |

# స్త్రీలలో ఉత్తమురాలు

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లంను ప్రవక్తగా పంపిన దైవానికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి మనం. ఎందుకంటే, మన ప్రియప్రవక్త (స) మనకు సరియైన దారిని చూపించారు. ఆయన గనుక మనకు దారి చూపకపోతే మనం దారితప్పిపోయేవాళ్ళం. ప్రళయదినాన మనం ఈ ప్రపంచంలో చేసిన మంచీచెడుల లెక్కలు తేలినప్పుడు సిగ్గుతో చితికిపోయే వాళ్ళం.

ప్రియప్రవక్త (స) చిన్నప్పటి నుంచీ చాలా మంచివారు. సత్యం తప్ప మరేదీ పలికేవారు కాదు. నిజాయితీగా మెలిగేవారు. అందుకే ప్రజలు ఆయన్ను, "సాదిఖ్", "అమీన్" అని పిలిచేవారు. పెద్దయిన తరువాత ఆయన (స) నిజాయితి చాలా ప్రసిద్ధమయ్యింది.

మక్కా నగరంలో ఓ గొప్ప ధనికురాలయిన స్త్రీ ఉండేది. ఆవిడ పేరు ఖదీజా (రజి). ఆవిడ చాలా మంచి మహిళ. అందరూ ఆమెను "తాహెరా' ' అని పిలిచేవారు. బీబీ ఖదీజా వితంతువు. ఆమె భర్త మరణించారు. ఆమె తన దగ్గర ఉన్న సంపదతో వ్యాపారం చేయాలని భావించింది. కాని వ్యాపారాన్ని చూసుకునేందుకు నిజాయితీపరుడయిన మనిషి ఎవ్వరూ దొరకలేదు. మన ప్రియప్రవక్త (స) నిజాయితీని గురించి విని ఆమె ఆయన (స) సహాయాన్ని కోరింది. ముహమ్మద్ (స) ఆమె సంపదను తీసుకుని దూరదూర ప్రాంతాలకు వెళ్ళి వ్యాపారం చేసేవారు. చాలా లాభాన్ని సంపాదించిపెట్టారు. వ్యాపారం ముగించి తిరిగివచ్చిన తరువాత పైస, పైస లెక్కకట్టి ఆమె

సొమ్మును ఇచ్చారు. ఆయన (స) నిజాయితీని చూసి బీబీ ఖదీజా (రజి) చాలా సంతోషించారు. ఆయన్ను (స) పెళ్ళాడాలని నిర్ణయించుకున్నారు. వాళ్ళిద్దరి పెళ్ళి జరిగింది. ఆనందంగా గడుపసాగారు.

ముహమ్మద్ ప్రవక్త (స)ను నలభై సంవత్సరాల వయసులో దేవుడు ప్రవక్తగా నియమించాడు. ఈ విషయాన్ని ప్రియప్రవక్త (స), బీబీ ఖదీజా (రజి) కు చెప్పారు. ఆమె వెంటనే విశ్వసించారు. దైవప్రవక్తగా తన బాధ్యతలు గుర్తొచ్చినపుడు ముహమ్మద్ (స) చాలా ఆందోళన చెందేవారు. బీబీ ఖదీజా (రజి), ఆయన (స)కు అన్నివిధాల ధైర్యం చెప్పేవారు. దైవధర్మాన్ని స్థాపించడంలో ముహమ్మద్ (స)కు బీబీ ఖదీజా (రజి) తన ధన ప్రాణాలను వొడ్డి సహాయపడ్డారు. క్రమక్రమంగా ఆమె తన వద్ద ఉన్న యావత్తు సంపదను ధర్మం కోసం ఖర్చు పెట్టేశారు. ఆమె గనుక లేకపోతే దైవధర్మాన్ని స్థాపించడంలో ప్రియప్రవక్త (స) మరింత కష్టపడవలసివచ్చేది. అందుకే ప్రవక్త (స), ఆమె (రజి)ను అమితంగా ప్రేమించేవారు.

"ఈ ప్రపంచ మహిళలలో అందరికన్నా ఉత్తమురాలు బీబీ ఖదీజా (రజి) " అని అనేవారాయన (స).

# దైవప్రేమ

దేవుడు చాలా కరుణామయుడు, కృపాకరుడు. తన సృష్టితాలయిన మనుష్యుల పట్ల అమిత ప్రేమగలవాడు. మన కోసం రకరకాల వరాలను ఇచ్చాడు. ఎల్లవేళలా తన కరుణాకటాక్షాలను మనపై కురిపిస్తుంటాడు. పుట్టిన వెంటనే మన కోసం అమ్మ ఛాతిలో పాలను ప్రవహించేలా చేశాడు.

అందరికి మన పట్ల ప్రేమ కలిగేలా చేశాడు. కష్టనష్టాలను భరించి, మనలను పెంచే శక్తిని మన తల్లిదండ్రులకు ఇచ్చాడు. దైవం మనలను ఇంతగా ప్రేమిస్తున్నపుడు మనం కూడా దైవాన్ని ప్రాణప్రదంగా ప్రేమించాలి. అవునా! అందుకే మంచి అమ్మాయిలు దైవాన్ని అందరికన్నా ఎక్కువగా ప్రేమిస్తుంటారు. దైవానికి కోపం వచ్చే పనులను ఎన్నడూ చేయరు.

చాలా కాలం క్రితంనాటి మాట. బీబీ మరియమ్ (రజి) అనే ఓ దైవ దాసురాలు ఉండేవారు. ఆమె ఎవరో తెలుసా? ఆమెయే హజ్రత్ ఈసా (అలైహిస్సలామ్) అంటే క్రీస్తుకు మాతృమూర్తి. బీబీ మరియమ్ (రజి) తల్లిదండ్రులు ఆమెను దైవమార్గంలో సమర్పించేశారు. ఆమె తన ఊరిలోని అన్నింటికన్నా పెద్ద మస్జిద్‌లో ఉండేవారు. చిన్నప్పటి నుంచి ఆమెకు దైవం పట్ల అమిత భక్తిప్రేమలు ఉండేవి. అన్నివేళలా ఆమె హృదయం దైవానికి అంకితమై ఉండేది. ఒంటరిగా ఉన్నప్పుడు దైవనామాన్ని స్మరించేది లేదా నమాజ్ చదివేది. దైవం ఆమె భక్తిపారవశ్యాన్ని మన్నించాడు. ఆమెను సకల చెడుల నుండి పవిత్రంగా ఉంచాడు. హజ్రత్ ఈసా (అస) లాటి కుమారుని ప్రసాదించాడు. ఆయన (అస) ప్రముఖ ప్రవక్త అని మీకు తెలుసు కదా! బీబీ మరియమ్ దైవంపట్ల చూపిన భక్తికి బదులుగా దైవం ఆమెకు అత్యున్నత హోదాను ఇచ్చాడు. ఆమెకు ముందు గతించిన మహిళలందరిలోనూ ఆమె అత్యుత్తమురాలుగా పేరుగాంచింది.

ఇంకా అనేక మంది దైవదాసులు, దైవంపట్ల ఎనలేని ప్రేమ కలిగి ఉన్నవారు చరిత్రలో దొరుకుతారు. అలాటి మరో ఉత్తమ మహిళ బీబీ రాబిఅ (రజి). బీబీ రాబిఅ (రజి) బస్రా నగరంలో ఉండేవారు. రాత్రి అంతా ఆమె దైవాన్ని స్మరిస్తూ గడిపేవారు. ఓనాడు రాత్రి అంతా ఆరాధనలో

గడిపారు. సహర్ (అంటే ప్రొద్దుపొడవడానికి కొద్దిగా ముందు) వేళ ఎవరో ఆమెతో, "మనకు రాత్రి అంతా ఆరాధనలో గడిపే అవకాశం ఇచ్చిన ఆ దైవానికి ఎలా కృతజ్ఞతలు తెలుపుకోగలం" అన్నారు. అందుకు బదులిస్తూ ఆమె, "ఈ వేళ ఉపవాసముండి కృతజ్ఞతలు తెలుపుదాం" అన్నారు.

ఆమె దైవారాధనలో లీనమై ఉన్నప్పుడు ఎవ్వరు వచ్చినా సరే, వారివైపు చూసేవారు కాదు. ఆమెకు దైవంపై ఎనలేని నమ్మకం. ఓసారి ఆమెకు జబ్బు చేసింది. ఓ వ్యక్తి ఆమెకు ఇవ్వడం కోసమని రూపాయల కట్ట ఒకటి తీసుకుని వచ్చాడు. కాని, ఆమె తిరస్కరించారు. ఆ వ్యక్తి హసన్ అనే ఓ పెద్ద మనిషి ద్వారా నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పుడు ఆమె ఏమన్నారో చూడండి:

"అయ్యా! హసన్‌గారూ! తన శత్రువులకు కూడా రోజూ రొట్టెను ప్రసాదించే ఆ దైవం, తనను ప్రేమించేవారికి ఇవ్వడంటారా? ఈ రూపాయలు నేనెందుకు తీసుకోవాలి?ఇవి ధర్మసమ్మతమయినవో? కావో?తెలియదు."

# తండ్రిపై ప్రేమ

బీబీ ఫాతిమా (రజి)ను ఎరుగనివారుండరు. ఆమె ప్రియ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లంకు ప్రియ పుత్రిక. ఆమె నలుగురు సోదరీమణులలో అందరికన్నా చిన్నవారు.

బీబీ ఫాతిమా (రజి) చాలా మంచి అమ్మాయి. రంగు, రూపం, నడక, నడత, మాట తీరు అన్నివిధాల ప్రియప్రవక్త (స)ను పోలి ఉండేవారు. ఆమె సుగుణాల కారణంగా ప్రియ ప్రవక్త (స) ఆమెను చాలా అభిమానించేవారు.

ఆమెకూ తండ్రి అంటే అమిత ప్రేమ. తండ్రికి ఏ కాస్త కష్టమొచ్చినా ఆమె తల్లడిల్లిపోయేవారు.

ఓనాడేమయ్యిందంటే, ప్రియప్రవక్త (స) కాబాలో నమాజ్ చదువుతున్నారు. అబూ జహల్ అనేవాడు ప్రియప్రవక్త (స)కు పెద్ద శత్రువు. వాడు అస్తమానం ప్రవక్త (స) వెంటపడుతూ ఉండేవాడు. వాడు తన మనుష్యులతో ఒంటె ప్రేగులను తెప్పించాడు. హుజూర్ సల్లల్లాహు అలైహి వ సల్లం సజ్దా అంటే సాష్టాంగ నమస్కారం చేస్తున్నపుడు ఆ ఒంటె ప్రేగులను ప్రవక్త (స) మెడపై వేసేశాడు. ఆ ప్రేగుల బరువు వల్ల సర్కార్ సల్లల్లాహు అలైహి వ సల్లం తల పైకెత్తలేకపోయారు. పైగా ఆ ప్రేగుల మాలిన్యం కారణంగా ఆయన బట్టలు కూడా అపరిశుభ్రం అయిపోయాయి.

అప్పటికి బీబీ ఫాతిమా (రజి) చిన్న పిల్ల. ఆమెకు ఈ వార్త తెలిసింది. వెంటనే పరుగెత్తుకుని వచ్చారు. తండ్రి స్థితిని చూసి ఆమె దుఃఖం కట్టలు త్రెంచుకుంది. ఆమె అవిశ్వాసులపై విరుచుకుపడ్డారు. తండ్రిపై నుంచి ఆ ప్రేగుల భారాన్ని తొలగించారు. ఆ తరువాత ఆ మాలిన్యాన్ని శుభ్రపరచసాగారు. ఆమె ఏడుస్తూ ఆ మాలిన్యాన్ని కడుగసాగారు. చాలా కష్టపడి ఆ అపరిశుద్ధతను శుభ్రం చేశారామె.

అలాగే ఓసారి హుజూర్ సల్లల్లాహు అలైహి వ సల్లం ప్రయాణం ముగించుకుని ఇంటికి రాసాగారు.బీబీ ఫాతిమా (రజి) గుమ్మం వద్ద నిల్చుని తండ్రి కోసం ఎదురుచూడసాగారు. ఆయన్ను చూడగానే ఏడుపు మొదలు పెట్టారు. ప్రవక్త (స) కూతురితో ఎందుకు ఏడుస్తున్నావని అడిగారు. అప్పుడామె "మీ పరిస్థితి నేను చూడలేను. అలసిసొలసిపోయినట్లున్నారు. బట్టల నిండా దుమ్ము ధూళి పేరుకుపోయింది. ఇలా మిమ్మల్ని చూస్తుంటే గుండె తరుక్కుపోతుంది" అన్నారు.

ప్రవక్త (స) ఆమెను ఓదార్చుతూ, "అమ్మా! ఏడ్వవద్దు, దైవం నీ తండ్రిని ధర్మప్రచారం కోసం నియమించాడు. ప్రపంచంలో మూలమూలలా ధర్మాన్ని ప్రచారం చేయాల్సి ఉంది. భవంతుల్లో ఉండేవారు, గుడిసెల్లో ఉండేవారు, ప్రతి చోట ఉండే వ్యక్తులు దైవధర్మాన్ని స్వీకరిస్తారు."

బీబీ ఫాతిమా (రజి)కు తండ్రి పట్ల అంతగా ప్రేమ ఉండేది. ప్రవక్త (స) తానిక తనువుచాలిస్తున్నట్లు చెప్పినప్పుడు ఆమె దుఃఖం వర్ణించనలవి కానిది. ఆమె ఏడుపును ఆపలేకపోయారు. కాని ప్రవక్త, "నా ఇంటి వారిలో అందరికన్నా ముందు నీవే నన్ను కలుసుకుంటావు" అని భవిష్యత్తును చెప్పి నపుడు వెంటనే నవ్వారు.

ప్రియప్రవక్త (స) మరణం ఆమెపై తీవ్రప్రభావాన్ని వేసింది. ఆమె దుఃఖంతో పరితపించారు. హుజూర్ (స) మరణం తరువాత ఆమె నవ్వగా ఎవ్వరూ చూడలేదు. అలా ఆరు నెలలన్నా గడువలేదు. ఆమె తన తండ్రిని కలుసుకున్నారు.

# అణకువ

"అణకువ అదృష్టం", "అణకువ లేకుంటే దురదృష్టం"- ఈ మాట ఎంతయినా నిజం. ఈ నిజాన్ని తెలుసుకున్న అమ్మాయిలు పెద్దల్ని గౌరవిస్తూ అణకువ కలిగి ఉంటారు. పెద్దల ముందు కిలకిలమని నవ్వరు. పెద్ద గొంతుతో మాట్లాడరు. నడకలో, మాటల్లో అణకువతో, సఖ్యతతో ఉంటారు. నోటితో అనవసరమైన మాటలు పలుకరు. అది కావాలి, ఇది కావాలి అని మంకు చేయరు. పెద్దల రాక గమనిస్తే అణకువతో లేచి నిలబడతారు. తలపై ఓణి కప్పుకుంటారు. సలామ్ చేస్తారు. పెద్దలు కూర్చోడానికి కుర్చీ

వేస్తారు. ప్రియ ప్రవక్త (స), ఆయన ప్రియ పుత్రిక బీబీ ఫాతిమా (రజి) తమ పెద్దల ముందు ఇలాగే ప్రవర్తించేవారు.

ఓసారి ఏమయ్యిందంటే, హుజూర్ (స) కూర్చుని ఉన్నారు. యాదృచ్ఛికంగా ప్రవక్త (స) ను పెంచిన తండ్రి అటు వచ్చారు. వెంటనే ప్రవక్త లేచి ఆయన్ను ఎంతో సాదరంగా ఆహ్వానించి, ఓ దుప్పటిపరచి కూర్చుండబెట్టారు. ఆ వెనుకనే పాలిచ్చిన తల్లి వచ్చారు. ఆమెనూ సాదరంగా ఆహ్వానించి, కూర్చోడానికి తన వద్ద ఉన్న దుప్పటి రెండో ముక్కను పరి చారు. ఆ వెనుక వరుసకు సోదరుడు వచ్చారు. ఆయన లేచి నిల్చుని ఆ సోదరుని కూర్చుండబెట్టారు.

బీబీ ఫాతిమా (రజి) తండ్రి ముందు చాలా అణకువతో మెలిగేవారు. హుజూర్ (స), బీబీ ఫాతిమాను చూడడానికి వెళ్ళినపుడు ఆమె అణకువతో లేచి నిల్చునేవారు. తండ్రిని కూర్చుండబెట్టేవారు. అందుకే ఆమెను తండ్రి అంతగా ప్రేమించేవారు.

# నిజాయితి

హజ్రత్ ఉమర్ (రజి) ఓ ప్రముఖ ఖలీఫా. ఆయనకు ఎల్లప్పుడు తన బాధ్యతలు గుర్తుండేవి. ప్రొద్దంతా ప్రజలకు మేలు చేసే కార్యకలాపాల్లో మునిగి ఉండేవారు. రాత్రిళ్ళు గస్తీ తిరిగేవారు. నగరమంతా పర్యటించి ప్రజలు ఎలా ఉన్నది తెలుసుకునేవారు.

ఓ రాత్రి ఆయన గస్తీ తిరుగుతున్నారు. ఓ ఇంటి ముందు వచ్చి నిలబడ్డారు. లోపల నుంచి ఏవో శబ్దాలు వినవస్తున్నాయి. ఆయన శ్రద్ధగా

వినసాగారు. లోపల తల్లీకూతుళ్ళిద్దరు మాట్లాడుకోసాగారు.

తల్లి : అమ్మాయీ! పాలల్లో నీళ్ళు కలుపు.

కూతురు: వద్దమ్మా! ఈ అధర్మం నేను చేయను. నువ్వు వినలేదా- పాలలో నీళ్ళు కలుపరాదని ఖలీఫా ఆదేశించింది.

తల్లి: నువ్వు మరీ అమాయకురాలవైపోతున్నావు. ఖలీఫా వద్దంటే ఏం? ఖలీఫా ఇక్కడికి వచ్చి చూస్తారా ఏంటీ?

కూతురు: ఖలీఫా చూడకపోతే ఏం? దైవమైతే చూస్తున్నాడు. నేనీ అధర్మం చెయ్యను.

హజ్రత్ ఉమర్ (రజి) ఆ మాటలన్నీ విన్నారు. కూతురి మాటలకు చాలా సంతోషించారు. ఆ ఇంటిని గుర్తుంచుకుని వెళ్ళిపోయారు.

మరుసటి రోజు వారిద్దరిని తన వద్దకు పిలిపించారు. రాత్రి జరిగిన సంభాషణ గురించి ప్రశ్నించి రూఢీపరచుకున్నారు. ఆ తరువాత తన కూమారుడు ఆసిమ్‌తో ఆ అమ్మాయికి పెళ్ళి జరిపించారు.

ఆ విధంగా ఓ పాలమ్ముకునే అమ్మాయి నిజాయితీకి బదులుగా దైవం ఆమెకు అంతటి సౌభాగ్యాన్ని ప్రసాదించాడు. ఆమె హజ్రత్ ఉమర్ (రజి) లాటి ప్రముఖ ఖలీఫాకు కోడలయ్యింది. అంతేకాదు, ఆమెకు దైవం హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రఅ) లాంటి మనుమడిని ప్రసాదించాడు. ఆయన కృషి వల్ల రాజ్యంలో చక్కటి పాలనా ఏర్పాట్లు జరిగాయి. హజ్రత్ ఉమర్ (రజి) ను జ్ఞప్తికి తెచ్చాడాయన. అల్లాహ్ వారందరిపై తన కారుణ్యాన్ని వర్షించుగాక!

# సాహసం

మహ్మూద్ గజని చరిత్రలో ప్రసిద్ధిగాంచిన రాజు. ఆయన చాలా ధైర్యసాహసాలుగల మహారాజు. ఆయన అనేక రాజ్యాలు జయించి తన రాజ్యాన్ని సువిశాలంగా చేసుకున్నాడు. మన దేశంపై కూడా గజని 17 సార్లు దండెత్తాడు. ఇక్కడి రాజులు తీవ్రంగా ప్రతిఘటించినప్పటికి ఎల్లప్పుడు గజనీదే పైచేయిగా ఉండేది.

ఓసారి ఆయన దర్బారులోకి ఓ వృద్ధ స్త్రీ వచ్చింది. ఆమె కుమారుడు ఓ వ్యాపార బృందంతోపాటు ఎక్కడికో వ్యాపారానికి వెళ్ళాడు. దారిలో బంది పోట్లు అతణ్ణి దోచుకుని చంపేశారు. ఆమె మహారాజుకు ఆ దుస్సంఘటనను వివరించి బందిపోట్లను శిక్షించాలని కోరింది. భవిష్యత్తులో బాటసారులకు బందిపోట్ల భయం లేకుండా తగిన ఏర్పాట్లు చేయమని కూడా అడిగింది.

మహారాజు ఆ వృద్ధ స్త్రీ మాటలను చాలా శ్రద్ధగా విన్నాడు. ఆ తరువాత, "పెద్దమ్మా! మీరు చెబుతున్న ప్రాంతం ఇక్కడికి చాలా దూరంలో ఉంది. మీరే ఆలోచించండి. అంత దూరప్రాంతంలో నేనిక్కడినుంచి ఎలా ఏర్పాట్లు చేయగలను?" అన్నాడు.

మహారాజు మాటలకు కోపం వచ్చి, "మీరు ఆ ప్రాంతంలో ఏర్పాట్లు చేయలేనప్పుడు ఆ ప్రాంతాలను జయించి రాజ్యంలో ఎందుకు కలుపు కున్నారు?" అనడిగింది ఆమె. వృద్ధురాలి ప్రశ్న సముచితమయినది. అందుకని మహారాజు సిగ్గుతో తలవంచాడు. మహ్మూద్ గజని పేరు విన్నంతనే పెద్ద పెద్ద దేశాధిపతులు గడగడ వణికేవారు. అలాంటి మహారాజు వృద్ధ స్త్రీ

చీవాట్లను మారుమాట్లాడకుండా విన్నాడు. తరువాత ఆవిడకు నష్టపరిహారాన్ని ఇప్పించి, బందిపోట్లను శిక్షించి తీరుతానని వాగ్దానం చేశాడు.

ఆ తరువాత ప్రతి వ్యాపార బృందానికి సైనిక రక్షణ కల్పించాడు. అలా బందిపోటు దొంగతనాలను నివారించాడు.

# తన పని తనకు

ప్రియ ప్రవక్త (సఅసం) ప్రియపుత్రిక బీబీ ఫాతిమా (రజి) గురించి ఇంతకు ముందు చదివారు కదా. బీబీ ఫాతిమా (రజి), మాతృమూర్తి బీబీ ఖదీజా (రజి) గురించి కూడా తెలుసుకున్నారు. ఆమె మక్కాలోని ఓ అత్యంత సంపద కలిగిన ధనిక స్త్రీ. అయినా బీబీ ఫాతిమా (రజి) ఇంటి పని మొత్తం స్వయంగా తానే చేసేవారు. స్వయంగా తిరగలి విసిరేవారు. ఎంతగా పని చేసేవారంటే చేతులకు బొబ్బలు కూడా వచ్చేసేవి. రోజూ మైళ్ళ దూరం నడిచి నీళ్ళు మోసుకొచ్చేవారు. అందువల్ల ఆమె ఎదుర్రొమ్ము నీలంగా కందిపోయింది. ఇల్లు ఊడ్చడం, వంట వండడం వల్ల బట్టలన్నీ మాసిపోయేవి. అక్కడక్కడా మరకలుపడేవి. పిండి కలుపడం, పిల్లల్ని చూడడం- అబ్బో ఎన్ని పనులంటే లెక్కేలేదు.

అలాగే చాలా రోజులు గడిచాయి. ఇంతలో ప్రవక్త (స) పాల్గొన్న ఓ యుద్ధంలో చాలా మంది స్త్రీలు యుద్ధ ఖైదీలుగా దొరికారు. ప్రవక్త (స)కు అనేక మంది దాసీలుగా వచ్చారు. హజ్రత్ అలి (రజి), ఫాతిమా (రజి)కు నచ్చజెప్పి తండ్రి ఇంటికి పంపారు. ఇంటి పనిలో సాయపడడానికిగాను ఓ దాసిని అడిగి తెచ్చుకోమని పంపారాయన. బీబీ ఫాతిమా (రజి) తండ్రి

ఇంటికయితే వెళ్ళారుగాని అక్కడ చాలా మంది ఉండటం వల్ల ఏమీ అడగలేకపోయారు. వెనుతిరిగివచ్చేశారు. ఆ తరువాత హుజూర్ సల్లల్లాహు అలైహి వ సల్లం స్వయంగా ఆమె ఇంటికి వచ్చారు. బీబీ ఫాతిమా (రజి) తన వద్దకు వచ్చిన కారణం తెలుసుకున్న తరువాత ఆయన (స), "ఈ బానిసలు, దాసి జనంపై నిరుపేద ముస్లిమ్‌లకు హక్కు ఉంది. నేను నీకు అంతకన్నా మంచి కానుక ఇస్తున్నాను, విను. ప్రొద్దుపోయిన తరువాత పడుకోకముందు ముప్పై మూడుసార్లు సుబ్‌హానల్లాహ్, ముప్పై మూడుసార్లు అల్ హమ్‌దులిల్లాహ్, ముప్పై నాలుగు సార్లు అల్లాహు అక్బర్ అని చదువుకో" అన్నారు. బీబీ ఫాతిమా(రజి) ఈ సలహాను అమలుపరిచారు. ఈ దైవ స్మరణలో ఆమెకు శాంతి లభ్యమయ్యేది. పగటి పని వల్ల కలిగిన అలసట దూరమయ్యేది. అందుకే ఈ స్మరణను తస్బీహె ఫాతిమా (రజి) అంటారు.

# బీదలకు సహాయం

షా కిర్మాని (రఅ) ఓ దైవభక్తి పరాయణులయిన ధర్మవేత్త. ఆయన ఓ రాజ్యానికి పాలకునిగా ఉండేవారు. క్రమంగా ఆయనకు ప్రాపంచిక విషయాలలో ఆసక్తి తగ్గిపోయింది. రాజ్యాధికారాన్ని విసర్జించి సన్యాసాన్ని స్వీకరించారాయన. ఎల్లవేళలా దేవుని ఆరాధనలో మునిగి ఉండేవారు. ఆయనకు దైవంపై అపరిమితమయిన విశ్వాసం ఉండేది. తన వద్ద ఏ కొద్ది మొత్తమున్నా బీదలకు, అవసరమున్నవారికి ఇచ్చేసేవారు. రేపటి భారాన్ని దైవంపై వేసేవారు.

ఆయనకు ఓ కుమార్తె ఉండేది. ఆమె చాలా మంచి అమ్మాయి. బీదలను ఆదుకునే మంచి హృదయంగల అమ్మాయి. ఆ అమ్మాయి పెరిగి

పెద్దదయిన తరువాత ఆమెకు పెళ్ళి సంబంధాలు చూడసాగారు. అనేక సంబంధాలు వచ్చాయి. ఓ మహారాజు సయితం సంబంధం పంపాడు. అయినా షా కిర్మాని (రఅ)ఆ సంబంధాలన్నిటిని తిరస్కరించారు. కుమార్తెను ఓ పేద యువకునికి ఇచ్చి పెళ్ళి చేశారు. ఆ అబ్బాయి చాలా మంచివాడు. ధర్మనిష్ఠాపరుడు. నమాజ్, రోజాలు క్రమబద్ధంగా పాటించేవాడు.

కుమార్తె తండ్రి వద్ద వీడ్కోలు తీసుకుని భర్త ఇంటికి చేరింది. అక్కడ భర్త ఇంటిలో రాత్రి మిగిలిన రొట్టె ముక్క ఉండటం చూసి,"ఇదేమిటి?" అనడిగింది.

భర్త: ఇది రాత్రి మిగిలిపోయిన రొట్టె ముక్క. ప్రొద్దుట పనికివస్తుంది లెమ్మని ఉంచాను.

భార్య: ఈ ఇంటిలో బహుశ నేను ఉండటం కష్టం కావచ్చు (అని లేచి వెళ్ళటానికి సిద్ధపడింది).

భర్త: ఓ రాజకుమార్తె నాలాటి బీదవాని ఇంటిలో ఎలా ఉండగలదని నేను ముందే అనుకున్నాను.

భార్య: మీరనుకున్నది నిజం కాదు. మీరు విశాల హృదయులని అనుకున్నాను నేను. పేదవాళ్ళ పట్ల సానుభూతి గలవారనుకున్నాను. కాని ఇక్కడ అంతా అందుకు వ్యతిరేకంగా ఉంది.

భర్త : అదెలా ! నాకేమి అర్థం కాలేదు.

భార్య: ఈ మిగిలిన రొట్టెను మీరు ఉంచుకున్నారేగాని, రాత్రి ఎంతో మంది నిరుపేదలు, అంగవైకల్యం కలవాళ్ళు ఆకలితో నిద్రపోయి ఉంటారన్న ఆలోచన మీకు రాలేదు. ఈ రొట్టె ముక్క ఆ బీదలలో ఏ ఒక్కరికి లభ్యమై

ఉన్నా మనకెంతో పుణ్యం లభించి ఉండేది. దైవం సంతోషించి రేపు మరింత ఇచ్చేవాడు. కాని మీకు బీదల బాధల గురించిన ఆలోచనలేదు. అందుకే మీ కోసం దాచి ఉంచుకున్నారు. ఇలాటి వ్యక్తితో నేనెలా ఉండగలను.

భార్య మాటలు విని భర్త సిగ్గుతో తలవంచుకున్నాడు. రొట్టె తీసుకెళ్ళి ఫకీరుకేసివచ్చాడు.

# గుర్తుంచుకోదగ్గ మాటలు

(1) దైవం ఒక్కడే, ఆయన అందరినీ పుట్టించాడు. అందరి అవసరాలు ఆయనే తీరుస్తాడు. అందువల్ల ఆయనే అందరికీ ప్రభువు, అందరికీ యజమాని, ఆయన ఆదేశాలను అందరూ శిరసావహించాలి. అందరు ఆయన ఆజ్ఞలను పాలించాలి.

(2) దైవం చాలా దయామయుడు, మనకు అనేక వరాలను ఇచ్చాడు. మనకు ప్రియమయిన తల్లిదండ్రులను ఇచ్చాడు. అందరిలోనూ మన పట్ల ప్రేమను సృజించాడు. మనం దైవానికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. దైవాన్ని ఆరాధించాలి.

(3) అల్లాహ్ తన సందేశాన్ని తెలుపుటకు ప్రవక్తను పంపాడు. ప్రవక్తలు తమతోపాటు దైవ గ్రంథాలు తెచ్చారు. ఆ గ్రంథాలలో జీవితం గడిపేందుకు అవసరమైన, సక్రమమైన, సవ్యమయిన మార్గాలున్నాయి. అందరికన్నా చివరన అల్లాహ్ ప్రియప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం వచ్చారు. ఆయన తరువాత ఇక ఏ ప్రవక్తా రారు. ప్రవక్త ముహమ్మద్ (స) ద్వారా అల్లాహ్ పవిత్ర

ఖుర్‌ఆన్ గ్రంథాన్ని పంపాడు. మనం ప్రవక్త (స)ను అనుసరించాలి. ఖుర్‌ఆన్ ఆదేశాలపై మనం నడవాలి.

(4) ఒకానొక రోజు మనుష్యులందరూ మరణిస్తారు. ఈ ప్రపంచం నశిస్తుంది. అల్లాహ్ అందర్ని మళ్ళీ జీవింపజేస్తాడు. ఇక్కడ చేసిన మంచి, చెడు పనుల లెక్క తీసుకుంటాడు. మంచి పనులకు బహుమానం, చెడు పనులకు కఠిన శిక్ష ఇస్తాడు. మనం దైవాగ్రహానికి భయపడాలి. మంచి పనులు చేసి దైవం ఇచ్చే బహుమానాల్ని అందుకోవాలి.

(5) అమ్మా నాన్న మనల్ని చాలా ప్రేమిస్తారు. మన సుఖం కోసం వాళ్ళు కష్టాలనుభవిస్తారు. మనకు మంచి ఆహారం, మంచి బట్టలు ఇప్పిస్తారు, చదివిస్తారు. మనం వారిని గౌరవించాలి. వారికి సేవ చేయాలి.

(6) చాలా మంది దైవదాసులు, నిరుపేదలు, అవసరార్థులు ఉన్నారు. వారి వద్ద తినడానికి, త్రాగడానికి, తొడగడానికి, కప్పుకోడానికి ఏమీ లేదు. మనం వారికి సహాయం చేయాలి. మన ఆహారంలో, మన దుస్తుల్లో వారికి కొంత భాగం ఇవ్వాలి. నిరుపేదలకు సహాయం చేస్తే దైవం సంతోషిస్తాడు. మంచి పనులు చేసినవారికి స్వర్గాన్నిస్తాడు.

# సిగ్గు-లజ్జ

సిగ్గు,లజ్జ అనేవి అమ్మాయిలకు అత్యంత విలువయిన ఆభరణాలు. ఈ ఆభరణాలు ధరించిన అమ్మాయిలు అందరి కళ్ళలో వెలుగవుతారు. అమ్మా, నాన్న, అన్నా, చెల్లెలు, బంధువులు, స్నేహితులు అందరూ గౌరవించి

మర్యాదగా చూస్తారు. మంచి అమ్మాయిలు సిగ్గు, లజ్జల గుణాలు కలిగి ఉంటారు.

ప్రియప్రవక్త (స), ప్రియ పుత్రిక బీబీ ఫాతిమా (రజి) గురించి మీకు తెలుసు కదా. అనేక ఇతర సుగుణాలతో పాటు ఆమె ఈ విషయంలో కూడా సాధారణ అమ్మాయిలకు మంచి ఉదాహరణగా నిలిచారు. ఆమెలో సిగ్గు, లజ్జ మెండుగా ఉండేవి. అసభ్యమైన మాటలకు ఆమె ఎప్పుడూ క్రోసుల దూరంలో ఉండేవారు.

ఓసారి ఓ పని పడి ఆమె తన తండ్రి (స) వద్దకు వెళ్ళారు. కాని, అక్కడ కొంతమంది కూర్చుని ఉండటం చూసి, తల వంచుకుని వెనక్కి వచ్చేశారు.

ఆమె ఎల్లప్పుడు తన శరీరాన్ని తల నుంచి కాళ్ళ వరకు జాగ్రత్తగా దుస్తులతో కప్పుకునేవారు. ఇంటి పని మొత్తం ఆమె ఒంటరిగా చేసేవారు. మైళ్ళ దూరం వెళ్ళి నీళ్ళు మోసుకొచ్చే వారు. అయినా పరదాని ఎప్పుడు తప్పనివ్వలేదు. శరీరాన్ని దుస్తులతో జాగ్రత్తగా కప్పుకునేవారు. శరీరం కనబడేలా పల్చటి దుస్తులను ఆమె ఎప్పుడూ ధరించేవారు కాదు.

జీవితంలో ఆమె ఎల్లప్పుడు జాగ్రత్తగా ఉండేవారు. అవసాన దశలోనూ, జబ్బుపడి కూడా మరణానంతరం శరీరం పరదా తప్పుతుందేమో అని చింతించేవారు. ఎందుకంటే అప్పటి వరకు స్త్రీల జనాజా కూడా మగవారి జనాజాలాగే బహిరంగంగా ఉండేది.

హజ్రత్ అమీస్ (రజి) పుత్రిక బీబీ అస్మా (రజి) ముందు ఈ విషయం ప్రస్తావించినప్పుడు ఆమె, "స్త్రీల జనాజాపై కర్రను ఉంచి, దానిపై దుప్పటి కప్పి పరదా ఏర్పరుస్తార"ని ధైర్యం చెప్పారు.

బీబీ ఫాతిమా (రజి)లో ఉన్న సిగ్గు, లజ్జల ప్రభావం వల్ల ఆమె ఒడిలో పెరిగిన కుమారుడు హజ్రత్ హుసైన్ (రజి) ధర్మాన్ని కాపాడడం కోసం తన ప్రాణాలను ధారపోశారు.

# ఖుర్ఆన్ పఠనం

ఖుర్ఆన్ పఠనంలో చాలా ప్రభావం ఉంది. ఖుర్ఆన్‌ను అర్థం చేసుకుని చదవడం వల్ల మనకు జ్ఞానం లభిస్తుంది. ఫజర్ నమాజు తరువాత క్రమం తప్పక ఖుర్ఆన్ చదివే అమ్మాయిలు, చిన్ని తమ్ముళ్ళపై, చెల్లాయిలపై కూడా దాని ప్రభావం పడుతుంది. కళ్ళు తెరువగానే వారి చెవులకు ఖుర్ఆన్ ఆయతులు వినిపిస్తాయి. వాళ్ళు ప్రభావితులు అవుతారు. క్రమేణా మంచి పిల్లలుగా రూపొందుతారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఓ పెద్ద ఖలీఫా, ఆయన పేరు వింటే పెద్ద పెద్ద రాజులు గడగడలాడేవారు. ఆయన తన సోదరి ఖుర్ఆన్ పఠిస్తుండగా విని, ప్రభావితులై, ఇస్లామ్‌ను స్వీకరించారు. మొదట్లో ఆయనకు ఇస్లామ్ పట్ల చాలా కోపం ఉండేది. అరబ్బులలోని అవిశ్వాసులైన సర్దారులు ముహమ్మద్ (స)కు వ్యతిరేకంగా ఆయన చెవుల్లో ఇల్లు కట్టుకుని పోరుపెట్టారు. ప్రియ ప్రవక్త (స) ఇస్లామ్ పేరుతో తాతముత్తాతల ధర్మాన్ని తొలగించాలని చూస్తున్నారని ఉమర్ (రజి) మండిపడసాగారు. ఓసారి కోపంపట్టలేక హుజూర్ (స)ను చంపేయాలని బయలుదేరారు. తౌబా, తౌబా. ఇస్లామ్ వెలుగును విరజి మ్ముతున్న దీపాన్ని ఆర్పివేయాలనుకున్నారాయన. దారిలో ఓ వ్యక్తి కనబడ్డాడు. హజ్రత్ ఉమర్ (రజి) చేతిలో నగ్నకరవాలం మెరుస్తుండటం

చూసి పరిస్థితి బాగోలేదని గ్రహించాడు. "ఉమర్ (రజి) ఎక్కడికో?" అనడిగాడు.

"ముహమ్మద్(స) పని పూర్తి చేయడానికి వెళుతున్నా" అని జవాబిచ్చారు. అప్పుడా వ్యక్తి , "ముందు నీ ఇంటి సంగతి చూడు. నీ సోదరి, బావగారూ ఇద్దరూ ఇస్లామ్ స్వీకరించి ముస్లిమ్‌లు అయిపోయారు" అన్నాడు.

అది వినగానే ఆయన గిరుక్కున వెనుదిరిగారు. బావగారి ఇంటిపైకి వెళ్ళారు. సోదరిని, బావను పట్టుకుని చావబాదారు. ఎంతగా కొట్టారంటే, వాళ్ళిద్దరూ రక్తంతో తడిసి ముద్దయిపోయారు. అప్పుడాయన సోదరి ఫాతిమా ఆవేశంతో, "ఉమర్ (రజి) నువ్వేమన్నా చేసుకో, మేమీ ధర్మాన్ని వదిలేవాళ్ళం కాము. నువ్వు కాస్త ఆ గ్రంథాన్నన్నా విను. అది వినే మేము ఇస్లామ్‌ను స్వీకరించాం." సోదరి మాటలు ఆయనపై ప్రభావం వేశాయి. పవిత్ర గ్రంథం పఠనాన్ని వినడానికి ఒప్పుకున్నారు. ఫాతిమా (రజి) తీయని స్వరంతో ఖుర్‌ఆన్ పారాయణం చేయసాగారు. ఒక రుకు పఠించారు.

హజ్రత్ ఉమర్ (రజి) చెవుల్లో తీయని ఖుర్‌ఆన్ శబ్దాలు పడగానే ఆయన చాలా ప్రభావితుడయ్యారు. కళ్ళ నుంచి నీళ్ళు కారసాగాయి. అక్కడి నుంచి లేచి తిన్నగా ప్రియప్రవక్త (స) సన్నిధికి చేరుకున్నారు. ఇస్లామ్‌ను స్వీకరించారు.

అలా సోదరి ఖుర్‌ఆన్ పఠనం వల్ల సోదరునిపై అంతటి ప్రభావం పడింది. ప్రవక్త (స)ను, ఆయన ధర్మాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ఆ సోదరుడు, ఇంటి నుంచి పెద్ద ఖడ్గాన్ని చేతబట్టి బయలుదేరినవారు కాస్తా ముస్లిమ్ అయిపోయారు. ధర్మానికి సేవ చేశారు.

# ప్రవక్త (స) పట్ల ప్రేమ

ప్రవక్త ముహమ్మద్ (స)ను సర్వ ప్రపంచానికి కారుణ్యంగా చేసి పంపాడు ఆ దైవం. ఆయన అందరి మేలును కోరేవారు. ఎవరినన్నా కష్టాలలో చూస్తే చాలా బాధపడేవారు. ఆ కష్టాలను తీర్చడానికి ప్రయత్నించే వారు. పిల్లలంటే ఆయన (స)కు అమిత ప్రేమ. ప్రవక్త (స) మనుమరాలు బీబీ ఉమామా. ప్రవక్త (స) మనుమరాలిని తరచుగా ఎత్తుకుని ఆడించేవారు. నమాజ్ చేస్తున్నపుడు కూడా ఆ మనుమరాలు చంకదిగేది కాదు. ఆయన అలాగే నమాజ్ మొదలుపెట్టి రుకూ, సజ్దాల్లోకి వెళ్ళినపుడు ఆమెను దించేసేవారు.

అలాటి ప్రియ ప్రవక్త (స)ను ప్రేమించనివాళ్ళు ఎవరుంటారు? అందుకే ఆడ, మగ, పిల్ల, పెద్ద అందరూ ఆయన్ను (స) తల్లిదండ్రులకన్నా, సోదరులకన్నా ఎక్కువగా ప్రేమించేవారు.

ఓసారి ఏమయ్యిందంటే, అవిశ్వాసులు ఓ పెద్ద సైన్యాన్ని తీసుకుని ముస్లిమ్‌లపై దాడిచేశారు. ప్రవక్త (స), ఆయన సహచరులతో (రజి) కలసి యుద్ధానికి వెళ్ళారు. యుద్ధంలో హుజూర్ (స) కు పెద్ద గాయమయ్యింది. కొందరు సహాబీలు షహీద్ అయ్యారు. ఆ వెంటనే ప్రవక్త (స) షహీద్ అయ్యారనే పుకారు వ్యాపించింది. ఆ పుకారుతో మదీనా ప్రజలకు దిక్కుతోచలేదు. స్త్రీలు, పురుషులు , పిల్లలు, వృద్ధులు అందరూ ఇళ్ళనుంచి బయటకు వచ్చారు.

మదీనాలో బనూదీనార్ అన్న వంశం ఒకటి ఉంది. ఆ వంశంలోని ఓ పుణ్య స్త్రీ ఈ పుకారు విని ముహమ్మద్ (స) పట్ల ప్రేమతో దిక్కుతోచక పరుగెత్తుకుంటూ యుద్ధరంగం దగ్గరకు వచ్చేసింది. ఆమె సోదరుడు, తండ్రి, భర్త ముగ్గురూ ఆ యుద్ధంలో షహీద్ అయ్యారని దారిలో తెలిసింది.

వారి మరణ వార్తను ఆమె సహనంతో విని, ఆ తరువాత, "అదంతా సరే, ముందిది చెప్పండి, హుజూర్ (స) ఎలా ఉన్నారు?" అని ప్రశ్నించారు జనంతో.

ప్రవక్త (స) జీవించి ఉన్నారని తెలిసింది. కాని తీవ్ర గాయం తగిలిందని చెప్పారు వాళ్ళు. ఆమె స్వయంగా వెళ్ళి హుజూర్ (స)ను చూసి సంతోషంతో, "మీరు ఉంటే చాలు, ఏదన్నా భరిస్తాం" అని బిగ్గరగా అంది.

# తల్లిదండ్రులను అయిష్టపరచరాదు

తండ్రి సంతోషం, దైవానికి సంతోషం. తండ్రి ఆగ్రహంలో దైవాగ్రహం ఉంది.

ప్రియ ప్రవక్త (స) ప్రియ పుత్రిక బీబీ ఫాతిమా (రజి)కు ఈ వాస్తవం చాలా బాగా తెలుసు. అందుకే తండ్రికి కోపం వచ్చే పనిని ఆమె ఎప్పుడూ చేసేవారు కాదు. ఎప్పుడయినా పొరబాటున చేస్తే వెంటనే పశ్చాత్తాపపడేవారు. మళ్ళీ ఆ పని చేసేవారు కాదు.

ఓసారి హుజూర్ (స) ప్రయాణం నుంచి మరలివచ్చారు. బీబీ ఫాతిమా (రజి) ఆనందంతో ఇల్లంతా అలంకరించారు. తలుపులకు రంగు రంగుల పరదా వ్రేలాడదీశారు. తన ఇద్దరు కుమారులు హజ్రత్ హసన్ (రజి), హజ్రత్ హుసైన్ (రజి)లకు వెండి కడియాలు తొడిగారు. సర్కార్ (స) అలవాటు ప్రకారం అందరికన్నా ముందు ఆమెను కలువడానికి వచ్చారు. కాని ఈ ఆర్భాటాన్ని చూసి ఫాతిమా (రజి) తో కలువకుండానే వెనుతిరిగారు. బీబీ ఫాతిమా (రజి)కు తండ్రికి కోపం వచ్చిందని తెలిసి చాలా బాధపడ్డారు.

కళ్ళ నుంచి నీళ్ళు ధారాపాతంగా కారాయి. గుమ్మానికి కట్టిన పరదాను తీసేశారు. పిల్లలకు వేసిన కడియాలు కూడా తీసేశారు. వాటిని హుజూర్ (స) వద్దకు పంపి, వాటిని నేను దానం చేసేశానని, మీరు ఎవరికన్నా ఇచ్చేయండని కబురంపారు. హుజూర్ (స) వాటిని అమ్మి, వచ్చిన సొమ్మును పేదలకు పంచిపెట్టారు. ధర్మసేవలో భాగంగా ఆ పేదవాళ్ళు, మస్జిదె నబవిలోని అరుగుపై ఉండేవారు.

ఓసారి హజ్రత్ అలి (రజి), బీబీ ఫాతిమా (రజి)కు ఓ బంగారు హారాన్ని ఇచ్చారు. ఆమె ఆ హారాన్ని మెడలో వేసుకుని ఓ స్నేహితురాలికి చూపుతున్నారు. అకస్మాత్తుగా ఆమెను చూడడానికి ప్రవక్త (స) వచ్చారు. బంగారు హారాన్ని చూసి ఆయన వెంటనే వెనుదిరిగి వెళ్ళిపోయారు. తండ్రికి ఇది ఇష్టం లేదని బీబీ ఫాతిమా (రజి)కు అర్థమయ్యింది. ఆమె ఆ హారాన్ని అమ్మి ఓ బానిసను కొన్నారు. ఆ బానిసకు స్వేచ్ఛనిచ్చారు. ఈ సంగతి తెలిసి ముహమ్మద్ (స) చాలా సంతోషించారు.

తండ్రికి ఏ పని ఇష్టం లేదని తెలిస్తే, బీబీ ఫాతిమా (రజి) ఆ పనిని వెంటనే మానుకునేవారు. అందుకే ప్రవక్త (స), ఆమెను అమితంగా ఆదరించేవారు, ప్రేమించేవారు, గౌరవించేవారూనూ.

# దానం

ప్రపంచంలో అందరి వద్ద సంపద సమానంగా లేదు. దైవం మనల్ని పరీక్షించడానికిగాను కొందరికి ఎక్కువ ఇచ్చాడు. మరికొందరికి తక్కువ ఇచ్చాడు. ఇంకొందరికైతే పాపం అస్సలు ఇవ్వలేదు. కడుపు నింపుకోవడానికి అన్నం, ఒళ్ళు కప్పుకోవడానికి బట్టలు కూడా లేనివారున్నారు. నిజానికి ఈ

నిరుపేదల వంతు సంపదను దైవం ధనికుల వద్ద అమానతుగా ఉంచాడు. అవసరార్థులను, నిరుపేదలను వెదికి వారి హక్కును వారికి ఇవ్వడం ధనికుల బాధ్యత. ఈ బాధ్యతను ఎరిగినవాళ్ళు బీదలకు, నిరుపేదలకు మనస్ఫూర్తిగా సహాయపడతారు. తాము స్వయంగా ఆకలితో అలమటిస్తూ తమ వంతు అన్నాన్ని కూడా బీదలకు పెట్టిన పుణ్యస్త్రీలు అనేక మంది ఉన్నారు.

ఓసారి ఏమయ్యిందంటే, బీబీ ఫాతిమా (రజి) ఇంట్లో తినడానికి ఏమీ లేదు. ఆమె భర్త హజ్రత్ అలి (రజి) కష్టపడి పనిచేసి కొంత సంపాదించుకుని వచ్చారు. బీబీ ఫాతిమా (రజి) భర్త తెచ్చిన గోధుమల్లో కొంత తిరగలి విసిరి పిండి చేసి రొట్టె చేశారు. తినడానికి వాళ్లు కూర్చున్నారో లేదో గుమ్మం ముందు ఓ బీదవాడు వచ్చి నిలుచున్నాడు. అమ్మా! ఆకలితో ఉన్నాను- అని యాచించాడు. బీబీ ఫాతిమా (రజి) తాను వండిందంతా అతనికిచ్చేశారు.

తరువాత మిగిలి ఉన్న గోధుమల్లో కొంత భాగాన్ని తీసుకుని పిండి చేసి మళ్ళీ రొట్టె చేశారు. తినేలోగా ఓ అనాథ వచ్చి యాచించాడు. ఆమె ఆ వండిందంతా అతడికిచ్చేశారు. ఇక మిగిలి ఉన్న కొంచెం గోధుమల్ని మళ్ళీ పిండి చేశారు.

మూడోసారి రొట్టె తయారయ్యింది. ఇంతలో ఓ ఖైదీ వచ్చి దైవ మార్గాన దానం చేయమని అడిగాడు. వెంటనే ఆమె ఆ రొట్టెను అతడికి ఇచ్చేసింది. ఇంటిలో ఏమీ మిగలలేదు. అందరూ ఆ రోజు ఆకలితో గడిపారు. ఆమె చేసిన పని దైవానికి చాలా సంతోషం కలిగించింది. ఆ ఇంటివారిని మెచ్చుకుంటూ దైవవాణి అవతరించింది. ఓ ఆయతులో

దైవం, "వాళ్ళు దైవం పట్ల ప్రేమతో నిరుపేదలకు, అనాథలకు, ఖైదీలకు అన్నం పెడతారు."

మీరే ఆలోచించండి, దైవం స్వయంగా మెచ్చుకున్న ఆ పుణ్యస్త్రీ కన్నా అదృష్టవంతురాలు ఇంకెవరన్నా ఉంటారా?

# తప్పును ఎత్తిచూపడం

ఎలాంటి లోపాలు, పాపాలు, తప్పులు లేనివాడు కేవలం దైవమొక్కడే. ఆ దైవం కేవలం ప్రవక్తలను మాత్రమే సకల పాపాల నుంచి పవిత్రంగా ఉంచాడు. మిగిలిన మానవులందరి వల్ల తప్పులు జరుగవచ్చు. నిజమైన దైవదాసులకు ఈ సత్యం తెలుసు. అందువల్లనే వారి తప్పుల్ని ఎవరన్నా ఎత్తిచూపితే చాలా సంతోషిస్తారు. మళ్ళీ ఆ తప్పు చేయరాదని నిర్ణయించు కుంటారు. ఎవరన్నా ఏదన్నా తప్పు పని చేస్తుండడం చూస్తే వెంటనే ఎత్తిచూపడం ప్రతి ముస్లిమ్ బాధ్యత. అలా చేయడం వల్ల చెడులు తగ్గిపోతాయి.

హజ్రత్ ఉమర్ (రజి) మీకు తెలుసు. ఆయన పేరు వింటే పెద్ద పెద్ద రాజులు గజగజ వణికేవారు. కాని, ఆయన తన తప్పుల్ని ఎత్తిచూపితే చాలా సంతోషించేవారు. ఉమర్ (రజి) ఏదన్నా తప్పు చేస్తే సాధారణ పౌరులు కూడా వెంటనే ఎత్తిచూపేవారు. ఆయన తన తప్పును దిద్దుకునేవారు.

ఓసారి ఆయన ప్రసంగం చేస్తున్నారు. ఆ ప్రసంగంలో ఆయన ముస్లిమ్‌లను పెళ్ళిళ్ళ సందర్భంగా అధిక మొత్తాన్ని మహర్ (స్త్రీ ధనం)గా నిర్ణయించడం తగదని కోప్పడ్డారు. ఆయన మాటలు ఉచితమయినవే. మహర్ (స్త్రీ ధనం) అధికంగా ఉండటం వల్ల పెళ్ళిళ్ళలో ఆటంకంగా

ఉంటుంది. హుజూర్ (స) కుమార్తెలు, భార్యల మహర్‌కన్నా అధిక మొత్తాన్ని ప్రజలు మహర్‌గా నిర్ణయించుకుంటున్నారని, ఇది తగదని, హుజూర్ (స) కుమార్తెలు, భార్యల మహర్‌కన్నా ఎక్కువ మహర్‌ను ఎవరన్నా నిర్ణయిస్తే, అది ఇక నుంచి శిక్షార్హమయిన నేరమని అన్నారు. మహర్ అధికంగా ఉండరాదని ఆయన నిరసించడం వరకు బాగానే ఉంది. కాని, మహర్‌కు పరిమితి విధించే హక్కు మాత్రం ఆయనకు లేదు. ఎందుకంటే, పవిత్ర ఖుర్‌ఆన్‌లో దైవం స్వయంగా ఎలాంటి పరిమితిని విధించలేదు. పైగా, మగవాడు ఎక్కువ ఇవ్వగలిగితే ఇవ్వాలని బోధించాడు. కాని, ఉమర్ (రజి)కు ఈ మాటలు గుర్తు రాలేదు. ఈ మాటలు ఆయన పలికిన వెంటనే ప్రసంగాన్ని వింటున్న శ్రోతలలో నుంచి ఓ స్త్రీ లేచి నిలబడి:

"ఉమర్ (రజి)! మీకు హద్దులు నిర్ణయించే అధికారం ఎక్కడ ఉంది? దైవం మా స్త్రీ జాతికిచ్చిన హక్కుల్ని మీరు కాలరాయాలనుకుంటున్నారా?" అని ప్రశ్నించింది.

ఆ తరువాత ఆ స్త్రీ ఖుర్‌ఆన్‌లోవున్న సంబంధిత ఆయత్ చదివింది. ఆ ఆయత్ అర్థం ఏమంటే:

"ఓ భార్యకు బదులుగా మీరు మరో భార్యను తెచ్చుకోవాలనుకుంటే, మొదటి భార్యకు మీరు ఇచ్చిన సంపద- అది ఎంత ఎక్కువయినా సరే- లోనుంచి చిన్న భాగం కూడా వాపసు తీసుకోరాదు."

ఇది విని హజ్రత్ ఉమర్ (రజి), "ఉమర్‌కన్నా ఎక్కువ పరిజ్ఞానం ఓ ముసలావిడకు ఉంది. ఈ రోజు ఈమె నన్ను ఓ పాపకృత్యం నుంచి రక్షించింది" అన్నారు.

చూశారా! తప్పును వెంటనే ఎత్తిచూపడం వల్ల ఎంత లాభముందో!

# పరోపకారం

ఇతరులకు సౌకర్యం కలుగజేయడానికిగాను స్వయంగా కష్టాలను భరించడం - అది పరోపకారం. ఇది మానవతకు సంకేతం, ఈ సుగుణం అబ్బాయిలకన్నా అమ్మాయిలకే ఎక్కువ ఇచ్చాడు దైవం. మంచి అమ్మాయిలు తమ తల్లిదండ్రుల కోసం, సోదరుల కోసం అనేక రకాల కష్టాలను ఓర్చు కుంటారు. ఒక్కోసారి ఇతరుల కోసం తమ ప్రాణాన్ని కూడా పణంగా పెట్టేస్తారు.

కొన్ని సంవత్సరాల క్రితంనాటి మాట. అరబ్బుల ఓ నగరం తరాబిస్‌పై శత్రువులు దాడిచేశారు. మగవాళ్ళందరూ శత్రువుల నెదుర్కోడానికి వెళ్ళారు. వారికి సహాయపడ్డం కోసం స్త్రీలు, అమ్మాయిలు కూడా అక్కడికి వెళ్ళారు. శవాలను ఎత్తడం, క్షతగాత్రులకు నీళ్ళందించడం, వారికి సేవ చేయడం లాంటి పనులు చేసేవారు. వారిలో ఓ పది, పన్నెండు ఏళ్ళ చిన్న పిల్ల ఫాతిమా ఉంది. తరాబిస్ నగరంలోని ఓ కులీన వంశం నాయకుడు అబ్దుల్లాహ్ ఏకైక పుత్రిక ఆ అమ్మాయి.

యుద్ధం భయంకరంగా జరుగుతోంది. శత్రువులు తుపాకి గుళ్ళ వర్షం కురిపిస్తున్నారు. పెద్దపెద్ద వీరులు కూడా ఆందోళనతో కంపించసాగారు. కాని, చిన్నారి ఫాతిమా తన వీపుపై నీళ్ళ సంచి వేసుకుని యుద్ధరంగంలో అటు ఇటు పరుగెత్తుతూ గాయపడినవారికి నీళ్ళు అందించసాగింది. ఆమె తెగింపు చూసి చాలా మంది ఆమెను వారించేవారు - నీవు మీ నాన్నకు ఉన్న ఒక్క కూతురివి, నీ ప్రాణాల్ని ప్రమాదంలో ఎందుకు వేసుకుంటావు అని. అయినా ఫాతిమా తన పని మాత్రం మానలేదు. ఎవరి మాటలు వినలేదు.

నలుగురు ముస్లిమ్ సైనికులు శత్రువుల కాల్పులకు గురై తీవ్రంగా గాయపడ్డారు. ఫాతిమా వెంటనే నీళ్ళు తీసుకుని అటు పరుగెత్తివెళ్ళింది. వాళ్ళకు నీళ్ళు అందించబోతుండగా ఓ శత్రు సైనికుడు వచ్చి చేయి పట్టుకున్నాడు. ఆమె విడిపించుకోవాలని విఫల ప్రయత్నం చేసింది. ఆ దగ్గరలో ఓ కరవాలం పడి ఉంది. ఆమె అకస్మాత్తుగా ఆ ఖడ్గాన్ని అందుకుని శత్రు సైనికుడి చేయి నరికేసింది. కాని, ఆ సైనికుడు రెండో చేత్తో ఫాతిమాను తీవ్రంగా గాయపరిచాడు. ఆమె రక్తంతో తడిసి పోయి, క్రిందపడి ఉన్న క్షతగాత్రుడి ప్రక్కన పడిపోయింది. ఆ పరిస్థితిలోనూ ఆమెకు గాయపడిన సైనికులకు సేవ చేయాలన్న భావం తగ్గలేదు. ఆమె పాకుతూ గాయపడిన వ్యక్తి దగ్గరకు వెళ్ళింది. కాని అతడికి నీళ్ళందించే లోపలే ఆమె ప్రాణ వాయువులు ఎగిరిపోయాయి. ఇన్నలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.

# అక్రమ సంపాదన

నలుగురు ఖలీఫాల తరువాత ముస్లిమ్‌లలోను అజ్ఞాన జాతుల ప్రభావం వల్ల రాజరికం మొదలయ్యింది. ప్రజాస్వామ్యయుతమైన ఖిలాఫత్ స్థానే వంశపారంపర్య రాజరికం వచ్చింది. ఈ రాజులు ప్రజాధనాన్ని తమ సొంత ఆస్తి అనుకునేవారు. తమ భోగాల కోసం ఖర్చు చేసేవారు. ప్రజానాయకునిగా కొనసాగడానికి సేవాభావం, ఖుర్‌ఆన్, హదీసుల పరిజ్ఞానం అవసరం లేదనుకోసాగారు. రాజు కుమారుడు ఎంత అసమర్థుడయినా అధికారానికి వచ్చేవాడు. ఇలా చాలా కాలం గడిచింది.

సాధారణ ముస్లిమ్‌ల పరిస్థితి రోజురోజుకి దిగజారసాగింది. రాజ కుటుంబీకులు ప్రజల సొమ్ముతో రాజభోగాలనుభవించసాగారు. కాని, కొంత కాలానికి హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ ఖిలాఫత్ పునఃస్థాపించి

ఖలీఫా అయ్యారు. ఆయన అత్యంత దైవభీతిపరుడు, నిష్ఠాపరుడు, మునుపటి నలుగురు ఖలీఫాల మాదిరిగా ఆయన ప్రజా సంక్షేమం పట్ల శ్రద్ధ వహించాడు. రాజకుటుంబీకుల జాగీరులను రద్దు చేశాడు. ఆ జాగీరులను వాళ్ళు అక్రమంగా పొందారు మరి. విచిత్రమేమంటే ఆయన స్వయంగా రాజకుటుంబీకుడే.

ఆయన భార్య హజ్రత్ ఫాతిమా కూడా రాజకుటుంబానికి చెందినదే. ఆమె వద్ద చాలా విలువయిన ఆభరణాలుండేవి. అవన్నీ ప్రజల సొమ్ముతో తయారు అయినవే. ఆయన భార్యకు నచ్చజెప్పి ఆ ఆభరణాలను ప్రజా ధనాగారానికి ఇచ్చేయమన్నాడు. ఆమె కూడా సంతోషంతో ఇచ్చేసింది.

హజ్రత్ ఉమర్ బిన్ అజీజ్ సంస్కరణలు రాజకుటుంబీకులకు నచ్చలేదు. అందువల్ల స్వయంగా ఆయన బావమరిది విషం ఇచ్చి ఆయన్ను హత్యచేశాడు. ఆయన్ను హత్యచేసిన తరువాత తన సోదరి బీబీ ఫాతిమా వద్దకు ఆమె ఆభరణాలు తీసుకుని వచ్చి, "నీ భర్త నీ పట్ల చాలా అన్యాయంగా, అక్రమంగా ప్రవర్తించాడు. నీ ఆభరణాలను ప్రజా ధనాగారానికి ఇచ్చేశాడు. తీసుకో, వాటిని పట్టుకువచ్చాను. ఇక సంతోషంగా ఉండు" అన్నాడు.

బీబీ ఫాతిమాకు తీవ్ర ఆగ్రహం వచ్చింది. "నేను మరణించిన నా భర్తను ఇప్పటికీ చాలా గౌరవిస్తున్నాను. ఈ ఆభరణాలు అక్రమ మార్గాన నా దగ్గరకు వచ్చాయి. నేను మనస్ఫూర్తిగా, సంతోషంతో వాటిని ప్రజా ధనాగారానికి ఇచ్చాను. ప్రజా ధనాగారంలోని ఈ సొమ్మును తీసుకునే హక్కు లేదు" అన్నది ఆమె.

ఆమె మాటలు విని ఆ సోదరుడు ముఖం నల్లగా మాడ్చుకుని వెళ్ళిపోయాడు.

# గుర్తుంచుకోదగ్గ మాటలు

ప్రియమయిన అమ్మాయిలూ! మీరు ప్రియ ప్రవక్త (స) ప్రియ పుత్రిక బీబీ ఫాతిమా (రజి) గురించి చదివారు. ఆమె ఎంతో సుగుణవతి. తన తండ్రిని అమితంగా ప్రేమించేది. తండ్రి దుఃఖాన్ని చూసి తల్లడిల్లిపోయేది. ఆయన్ను ఎల్లప్పుడు సంతోషంగా ఉంచే ప్రయత్నాలు చేసేది. ఆయనకు కోపం వచ్చే పని ఏదీ చేయదు. ఎందుకంటే, ఆమెకు తెలుసు, తండ్రి సంతోషంలోనే దైవ సంతోషం ఉంది. తండ్రి కోపిస్తే దైవమూ కోపిస్తాడు అని. ప్రియప్రవక్త (స) అన్ని పనులను స్వయంగా చేసేవారు. ఇంటి పని మొత్తం బీబీ ఫాతిమా (రజి) స్వయంగా చేసేవారు. బీదవారిని, అవసరార్థులను ఆదరించేవారు. తాను ఆకలితో ఉండి వారికి అన్నం పెట్టేది. సిగ్గు, బిడియాలు కలిపి మూసబోసిన బొమ్మ ఆమె. ఆమె జీవితం యావత్తు సిగ్గు, బిడియాలతో గడిచింది. ఆఖరికి అవసానదశలోనూ 'పరదా'తో వెళ్ళే ఆచారాన్ని వదిలివెళ్ళారు. నమాజ్, రోజా, దైవస్మరణలను ఎన్నడూ మానేదికాదు. ఓ దైవస్మరణ పేరు 'తస్బీహె ఫాతిమా' గా ప్రసిద్ధమయ్యింది. హజ్రత్ ఫాతిమా (రజి) రంగు, రూపం,నడత, మాట తీరులో పూర్తిగా తండ్రిని పోలి ఉండేవారు. ఆమె సుగుణాల వల్ల ఆమెను తండ్రి, ఇంటివారు, బంధువులు అందరూ ప్రేమించేవారు. అంతేకాదు, నేటికీ ఆమెను గురించి చదివినవారు, విన్నవారు ఆమెను మనస్ఫూర్తిగా గౌరవిస్తారు.

మీరు హజ్రత్ ఉమర్ (రజి) సోదరి ఫాతిమా (రజి) గురించి చదివారు. ఆమె ధర్మం కోసం తన సోదరుని దెబ్బలను సహించింది. ఆమె దృఢచిత్తం, ఖుర్ఆన్ పారాయణాల కారణంగా హజ్రత్ ఉమర్ (రజి) లాటి కఠినచిత్తుని హృదయం మైనంలా కరిగిపోయింది. ఆయనకు విశ్వాస సంపద ప్రాప్తించింది.

మీరు రెండవ ఉమర్ గురించి, ఆయన భార్య బీబీ ఫాతిమా గురించి చదివారు. ఆమె ఎంతో పుణ్యస్త్రీ. ఆమెకు తన ఆభరణాలు అక్రమ మార్గాన వచ్చినవని తెలియగానే ఆమె ఆ ఆభరణాలను ప్రజా ధనాగారానికి ఇచ్చేసింది. భర్తను హత్య చేసి సోదరుడు ఆభరణాలను తెచ్చినపుడు ఆమె తిరస్కరించారు.

అబ్దుల్లా కూతురు ఫాతిమా గురించి చదివారు. ఆమె ఎంత ధైర్యశాలి? చిన్న పిల్ల అయివుండి యుద్ధరంగంలో ఎలాటి భయమూ లేకుండా తిరిగింది. తన ప్రాణాన్ని పణంగా పెట్టి గాయపడినవారికి సేవ చేసింది. వారికి నీళ్ళు త్రాగించింది. పరుల కోసం ప్రాణాలనే ఇచ్చింది.

చూశారా! ఈ పేరులోని మహాత్మ్యం. అందుకే ప్రజలు తమ పిల్లలకు ఫాతిమా అని పేరు పెట్టుకుంటారు. మీలో కూడా చాలా మంది పేరు ఫాతిమా కదూ. లేదా మీ పేరులో ఫాతిమా అని అయినా ఉండవచ్చు. బిల్ఖిస్ ఫాతిమా, బిర్జిస్ ఫాతిమా, ఫాతిమా, కనీజ్ ఫాతిమా వగైరాలు అన్నమాట. బీబీ ఫాతిమాలా మీరు సుగుణాలరాశి కావాలని ఆ పేరు పెట్టారు.

ప్రతి తండ్రి తన కూతురికి ప్రసిద్ధిగాంచిన పుణ్యస్త్రీల పేరు పెడతాడు. ఎందుకంటే, తన గారాలపట్టి కూడా అంతటి పుణ్యమూర్తి కావాలని. మీ పేరుగల ప్రసిద్ధ స్త్రీలు ఎవరో తెలుసుకోండి. ఆ తరువాత మీ పేరుకున్న మర్యాదను కాపాడుకునేలా మంచి పనులు చేయండి.

- : సమాప్తం : -